సాక్షి
మంచిర్యాల
గురువారం । 28 । నవంబర్ । 2024



ఎక్కడి చెత్త అక్కడే
మంచిర్యాల పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కార్మికుల కొరతతో చెత్తాచెదారం ఎక్కడికక్కడే పేరుకుపోతోంది. దుర్వాసన వెదజల్లుతున్నా పట్టింపు కరువైంది. 9లో▸



కౌన్సిల్ సమావేశం బహిష్కరణ
చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ వ్యవహార శైలిపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్‌తో వాగ్వాదానికి దిగి సమావేశాన్ని బహిష్కరించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0 /16.0

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

గూడెంలో భక్తుల కార్తిక పూజలు



సత్యదేవుణ్ని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి: తెలంగాణ అన్నవరంగా ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తిక పూజలు కొనసాగుతున్నాయి. ద్వాదశి సందర్భంగా బుధవారం భక్తులు అధిక సంఖ్యలో సత్యదేవుణ్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 300 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

సర్వే డేటా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

జైపూర్: మండల పరిషత్ కార్యాలయంలో సర్వే డేటా నమోదు ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ బుధవారం పరిశీలించారు. సర్వే వివరాలను సరిగ్గా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డేటా ఎంట్రీలో జైపూర్ మండలం చాలా వెనుకబడి ఉందని, వేగంగా ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ డేటా ఎంట్రీ ఆపరేటర్ రోజుకు కనీసం 30నుంచి 40ఫారాలను పూర్తి చేయాలని, లేనిపక్షంలో చర్యలకు బాధ్యులు అవుతారని తెలిపారు. అనంతరం కోటపల్లి గురుకులాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు.

ఎస్టీపీపీలో పర్యావరణంపై సమీక్ష

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో బుధవారం పర్యావరణానికి సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యావరణ డీజీఎం వాసుదేవమూర్తి మాట్లాడుతూ ప్లాంటు పరిసర ప్రాంతాల్లో పర్యావరణ స్థితిగతులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి చేపడుతున్న మిథనాల్ ప్లాంటు పనులను తెలిపారు. ఈ సమావేశంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖరావు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, అధికారులు ప్రసాద్, సుధాకర్, మదన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వికాస్ యోజనపై అవగాహన



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ డీజీపీ శర్మ

పాతమంచిర్యాల: ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ తెలంగాణ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో గ్రామీణ వికాస్ యోజన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఖాదీ గ్రామీణ పరిశ్రమల డిప్యూటీ డైరెక్టర్ డీజీపీ శర్మ మాట్లాడుతూ గ్రామీణ వికాస్ యోజనతో యువత 12రకాల స్వయం ఉపాధి పథకాలు నెలకొల్పవచ్చని అన్నారు. లీఫ్‌ప్లేట్లు, అగర్‌బత్తి తయారీ, చింతపండు ప్రాసెసింగ్, తేనేటీగల పెంపకం, కుమ్మరి ఎలక్ట్రిక్ సారెలు, చెక్క పనులు, మొబైల్ రిపేరింగ్, చెక్కపని చేసేవారికి మిషన్‌లు, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ పనులపై ఉచిత శిక్షణ ఇచ్చి యంత్రాలను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వినోద్‌కుమార్, కౌన్సిలర్ మాధవి శ్రీనివాస్, కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర తిరుపతి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్ అజీజ్



అబ్దుల్ అజీజ్

నస్పూర్: ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్ అజీజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పట్టణ అధ్యక్షుడు మైదం రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సభ్యుల సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్యాంసుందర్‌రెడ్డి, కోశాధికారిగా డి.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రమోద్, శ్రీధర్‌రెడ్డి, జోబిన్, రాజన్న, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా రజిని, సంయుక్త కార్యదర్శులుగా సన్నీ, మనికంఠ, సుఫియాన్, రవీందర్ ఎన్నికయ్యారు. పట్టణ ప్రధాన కార్యదర్శి ఊట్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు అమన్‌ప్రసాద్, కోశాధికారి అంబాల రాజ్‌కుమార్, వివి ధ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

గులాబీ జోష్ పెరిగేనా!

- కొంతకాలంగా పార్టీ నాయకుల్లో స్తబ్ధత
- అంటీముట్టనట్లుగా ఉంటున్న కేడర్
- నాయకులు లేని చోట్ల మరింత డీలా
- ‘దీక్షా దివస్’తో ఉత్సాహం నింపేలా ఏర్పాట్లు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ‘గులాబీ’ పార్టీ మళ్లీ ప్రజాక్షేత్రంలో సమస్యలపై పోరాటానికి సిద్ధమైంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో కోలుకోలేని దెబ్బతిన్న బీఆర్‌ఎస్ పార్టీ కేడర్ కొంతకాలంగా గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నుంచే అనేక మంది కీలక నేతలు పార్టీ మారారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సహా అనేక మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మాజీలు అధికార పార్టీ గూటికి చేరారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాల్లో బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల నుంచి మాత్రమే పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మిగతా చోట్ల మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ అందరూ ఎక్కువగా ఇళ్లకే పరిమితం అవుతున్నారు. పార్టీని మళ్లీ బలోపేతం చేయాలనే ఆదేశాలు అధిష్టానం నుంచి రావడంతో అందరూ క్రియాశీలకంగా మారుతున్నారు.

బలోపేతానికి ఆరాటం

గత కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తల్లో తిరిగి జోష్ నింపేలా పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇప్పటికే రైతుల పంట రుణమాఫీతో సహా పలు సందర్భాల్లో బీఆర్‌ఎస్ పార్టీ రోడ్లపైకి వచ్చిన నిరసనలు చేపట్టిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో మాజీ సీఎం కేసీఆర్ 2009 నవంబర్ 29న ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన రోజును పురస్కరించుకుని అన్ని జిల్లా కేంద్రాల్లో ‘దీక్షా దివస్’ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాది కావస్తోంది. ఇచ్చిన హామీల అమలు, సంక్షేమ పథకాలు తదితర విజయాలపై ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పరంగానే ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ హోదాలో గత ఏడాదిలో జరిగిన సర్కారు తీ రుపై పోరాటం చేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఇక నుంచి క్రియాశీలకంగా వ్యవహరించేందుకు ప్రణాళిక రచించారు. అంతేగాక బీఆర్‌ఎస్ పార్టీ సంస్థాగతంగా ఎక్కడైనా పదవులు ఖాళీగా ఉంటే వెంటనే నియామకాలు చేపట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

స్థానిక సంస్థలపై గురి

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి బలపడేందుకు, గ్రామాల్లో పట్టు సాధించేందుకు పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు పార్టీలో ఉన్న కేడర్, అధికార పార్టీకి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు నాయకుల్లో ఉత్సాహం నింపుతున్నా రు. అధికార పార్టీతోపాటు బీజేపీ ప్రభావం ఉన్న చోట్ల కేడర్‌ను సిద్ధం చేస్తోంది. అలాగే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ తమ పార్టీ మద్దతుదారును గెలిపించుకునేలా సిద్ధం చేస్తోంది. గ్రామాల్లో ఇప్పటికీ ఓటు బ్యాంకు ఉందని, కాపాడుకునేందుకు స్థానిక సంస్థల నాయకులను బలో పేతం చేసేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే పార్టీ మారిన తాజా, మాజీ నాయకుల స్థానంలో కొత్త నాయకత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. ప్రత్యే క రాష్ట్ర ఉద్యమ సమయంలో పని చేసిన నాయకులు, సీనియర్లు చాలా మంది చేజారిపోయారు. ఈ క్రమంలో పూర్వ వైభవం తెచ్చేందుకు గులాబీ నాయకత్వం తీవ్రంగా చెమటోడ్చాల్సి ఉంది.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం



ఇందన్‌పల్లి రేంజ్‌లో అటవీ అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

- 20రోజుల్లో పది ట్రాక్టర్లు సీజ్
- ఎకో సెన్సిటివ్ జోన్‌లో నిషేధం
- రూ.4లక్షల వరకు జరిమానా

జన్నారం: టైగర్‌జోన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై అటవీ శాఖ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. హెచ్చరించినా వినని ట్రాక్టర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్ ఇందన్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలో రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ 20రోజుల్లో పది ట్రాక్టర్లు సీజ్ చేశారు. జన్నారం అటవీ డివిజన్ పరిధిలో నిత్యం వందల ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఎలాంటి పన్ను చెల్లించకుండా ప్రభుత్వానికి రూ.లక్షలు ఎగనామం పెడుతున్నారు. బాదంపల్లి, రాంపూర్, తిమ్మాపూర్, చింతగూడ వంటి గోదావరి తీర ప్రాంతాల్లో కూడా ఇసుక తోడుతున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.1000 నుంచి రూ.2వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటుక తయారీదారులు అక్రమంగా వందల ట్రాక్టర్ల ఇసుక నిల్వ చేస్తున్నారు. కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ ఎకో సెన్సిటివ్ జోన్(పర్యావరణ సున్నిత ప్రాంతం 1986) ఏర్పాటు చేశారు. జన్నారం అటవీ డివిజన్‌లో 26కిలోమీటర్ల దూరంలో జోన్ విస్తరించి ఉంది. వన్యప్రాణులు, అడవి అభివృద్ధి దృష్ట్యా సెన్సిటివ్ జోన్ చట్టం ప్రకారం టైగర్ జోన్ నుంచి పది కిలోమీటర్ల దూరం ఇసుక, మొరం, బండలు తీయరాదని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గత ఎఫ్‌డీవో మాధవరావు టైగర్‌జోన్ పరిధిలో పది కిలోమీటర్ల మేరకు ఇసుక అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేశారు. ఆయన బదిలీపై వెళ్లడంతో అక్రమ రవాణా పెరిగింది. అక్టోబర్ 14న బాధ్యతలు చేపట్టిన ఇందన్‌పల్లి రేంజ్ అధికారి, జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ అధికారి శ్రీనివాస్ ఇసుక అక్రమ తరలింపు అడ్డుకట్టకు చర్యలు చేపట్టారు. గత 20 రోజుల్లో ఇందన్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలో పది ట్రాక్టర్లు సీజ్ చేశారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.40వేల నుంచి రూ.50వేల వరకు జరిమానా విధించారు. ఇప్పటివరకు రూ.4లక్షలు జరిమానా రూపంలో ప్రభుత్వ ఖాతాలో జమ చేశారు.

నిషేధం అమలు



కవ్వాల్ టైగర్‌జోన్, జన్నారం డివిజన్ పరిధి ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో ఇసుక తోడడం నిషేధించడం జరిగింది. కొందరు అటవీ ప్రాంతాల వాగుల నుంచి ఇసుక తోడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. జోన్ పరిధిలో ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు. ట్రాక్టర్ రెండోసారి దొరికితే జరిమానాతోపాటుగా కేసు నమోదు చేస్తాం.

– కారం శ్రీనివాస్, ఫారెస్టు రేంజ్ అధికారి

అర్హులందరికీ నష్టపరిహారం




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- రైతులతో సమావేశం

జైపూర్: మంచిర్యాల–వరంగల్–ఖమ్మం–విజయవాడ జాతీయ రహదారి–163జీ నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతీ ఒక్కరికి పరిహారం అందిస్తామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండలంలోని రొమ్మిపూర్‌లో కొనసాగుతున్న జాతీయ రహదారి–163జీ పనులను బుధవారం కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. అనంతరం స్థానిక రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో మాట్లాడారు. జాతీయ రహదారి నిర్మాణానికి ప్రజలు సహకరించాలని, భూములు కోల్పోయిన వారికి జాబితా ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు. మొదటి జాబితాలో పరిహారం అందని అర్హులు సంబంధిత పత్రాలు, బ్యాంక్ పాస్‌పుస్తకాలతో మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. భూమిలో పట్టాదారు, కబ్జాదారు ఇద్దరూ ఉన్నట్లయితే వారి ఇరువురి సమ్మతితో ఒక్కరికే పరిహారం చెల్లిస్తామన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఆ సొమ్మును కోర్టులో జమ చేస్తామని అన్నారు. భూముల్లో చెట్లు, బోర్లు, పైపులు ఉంటే సంబంధిత ఫొటోలు, పక్కభూమి రైతు వద్ద సంతకం తీసుకుని తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, నిర్దేశిత ధరల ప్రకారం పరిహారం చెల్లిస్తామని చెప్పారు. అనంతరం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని గురుకులాలు, కేజీబీవీని ఆకస్మికంగా సందర్శించారు. వంట గది, ఆహార నిల్వలు, రిజిష్టర్లు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహా రాన్ని అందించాలని, శుద్ధమైన తాగునీరు, వి ద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాస్‌రావుతో కలిసి జాతీయ రహదారి–163జీ నిర్మాణంలో భూములు కోల్పోయి న బాధితులకు అందిన పరిహారం వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

పచ్చని ప్రకృతిని భావితరాలకు అందించాలి

- బెల్లంపల్లి రేంజ్ అధికారి పూర్ణచందర్
- అడవిని సందర్శించిన విద్యార్థులు



వనదర్శినిలో విద్యార్థులు, అధికారులు

కాసిపేట: పచ్చని ప్రకృతిని భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బెల్లంపల్లి అటవీశాఖ రేంజ్ అధికారి పూర్ణచందర్ తెలిపారు. బుధవారం బెల్లంపల్లి రేంజ్ పరిధి ముత్యంపల్లి సెక్షన్ గురువాపూర్ అటవీ ప్రాంతంలో కాసిపేట తెలంగాణ మోడల్‌స్కూల్ విద్యార్థులతో వనదర్శిని కార్యక్రమం నిర్వహించారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ పనులు చూపిస్తూ వాటి ఉపయోగాలను వివరించారు. చెక్‌డ్యాం, నీటికుంటలు, వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి కట్టించామని, బయటి పశువులు, మనుషుల ప్రభావం తగ్గించడానికి అడవి చుట్టూ కందకాలు తవ్వించామని తెలిపారు. అటవీ రక్షణలో భాగంగా ఎక్కువ ప్రాంతాన్ని చుట్టి రావడానికి రోడ్లు వేసినట్లు తెలిపారు. అడవిని జాగ్రత్తగా కాపాడడం వల్ల వన్యప్రాణుల సంతతి పెరిగిందని, ఇటీవల పెద్దపులి సైతం వచ్చి తి రిగిందని పులి పాదముద్రలు చూపించారు. అట వీలోని వృక్ష జాతులు, సీతాకోక చిలుకల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. విద్యార్థులకు అటవీ ప్రాంతంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్, బీట్ ఆఫీసర్లు శ్రీధర్, యుగేందర్, ప్రిన్సిపాల్ ఖలీల్, ఉపాధ్యాయులు నాగమల్లయ్య, గణేష్, సుష్మా, మాధురి, స్వరూపరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

యజమాని డబ్బు దొంగలించిన డ్రైవర్ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

జైపూర్: యజమాని డబ్బులు దొంగిలించిన కారు డ్రైవర్ జైలుపాలయ్యాడు. నమ్మకంగా పని చేయాల్సిన డ్రైవర్ డబ్బు ఆశతో ఇంటికే కన్నం వేశాడు. జైపూర్ అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ వెంకటేశ్వర్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. భీమారం మండలానికి చెందిన మూడ్ రాజేందర్ కాంట్రాక్టర్‌గా పని చేస్తూ జైపూర్‌లో సాగర్‌రావు కాంప్లెక్స్‌లో నివాసం ఉంటున్నాడు. కొంతకాలం నుంచి అతడి వద్ద ఇదే భీమారం మండలానికి చెందిన నిట్టూరి మహేశ్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వ్యాపార నిమిత్తం రాజేందర్ గత నెల 8న రూ.10లక్షలు తీసుకువచ్చి అద్దె ఇంట్లో ఉంచాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గది తాళం చెవి సహాయంతో మహేశ్ ఇంట్లో ఉన్న డబ్బును దొంగిలించాడు. బాధితుడు రాజేందర్ మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బుధవారం ఇందారం క్రాస్ రోడ్డు వద్ద సీఐ వేణుచందర్ తన సిబ్బందితో నిందితుడిని అరెస్టు చేశారు. అతడి వద్ద రూ.8.51లక్షలు నగదు, సెల్‌ఫోన్, తాళం చెవి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఆర్కేపీ భవిష్యత్ ప్రశ్నార్థకం?

- 2003నుంచే ఏరియా ఉనికికి బీటలు
- ఉన్న ఒక్క ఓసీపీ మూతపడితే ఇక అంతే..!



త్వరలో మూతపడనున్న ఆర్‌కే ఓసీ(ఫైల్)

రామకృష్ణాపూర్: సింగరేణి కాలరీస్ సంస్థలోనే రామకృష్ణాపూర్ ఏరియాకు సుస్థిరమైన స్థానం ఉండేది. భూగర్భ గనులతో వెలుగొందిన పట్టణం భవిష్యత్ నేడు ప్రశ్నార్థకంగా మారింది. ఆశించిన బొగ్గు నిక్షేపాలు ఉన్నా ఆర్థికపర అంశాలతో ముడిపెట్టి.. నష్టాలను బూచిగా చూపి ఏరియా ఉనికికే ఉపద్రవం తెచ్చారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని జాతీయ కార్మిక సంఘాల నేతలు ఏం పట్టనట్లు వ్యవహరించడం యాజమాన్యానికి కలిసొచ్చేలా చేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్న ఒక్క ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు మూసివేస్తే ఎలాగానే ఆందోళన నెలకొంది. ఆర్కే–1, ఆర్కే–1ఏ, ఆర్కే–2, ఆర్కే–3, ఆర్కే–4, ఎంకే–4, ఎంకే–4ఏ ఇలా రామకృష్ణాపూర్ ఏరియాలో ఒకప్పుడు నల్లబంగారం సిరులు పండించిన భూగర్భ గనులు ఇవి. బొగ్గు ఉత్పత్తిలో తనవంతు భూమిక పోషించింది. జీఎం కార్యాలయంతోపాటు ఏరియా స్టోర్స్, వర్క్‌షాప్, టింబర్‌యార్డు తదితర కార్యాలయాలతో పట్టణం కళకళలాడింది. సింగరేణి సంస్థ పరిధిలో ఉన్న 13డివిజన్లతో పోటీ పడి మరీ బొగ్గు ఉత్పత్తి సాధించింది. వేలాది మంది సింగరేణి కార్మికులతో తులతూగిన రామకృష్ణాపూర్ పట్టణాన్ని నేడు చీకటి ఆవహిస్తోంది. గనులతోపాటు కంపెనీ కార్యాలయాలు కనుమరుగయ్యాయి. ఈ పరిణామాలు కార్మిక కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గనుల మూసివేత ఉపాధి అవకాశాలకు గండికొడితే.. ఏరియా ఎత్తివేత ఏకంగా పట్టణ భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మారుస్తోంది.

రెండో దశ లేకుంటే రెంటికి చెడ్డ రేవడే..!

ఇప్పుడున్న రామకృష్ణాపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ మరో రెండు నెలల్లో మూసివేస్తున్న సంగతి తెలిసిందే. వాస్తవానికి ఈ ఓసీపీ రెండో దశ(మెగా ఓసీ) పనులు ఇప్పటికే ప్రారంభించాల్సింది. కానీ అంతులేని అలసత్వం, నిర్లక్ష్యం.. కార్మికులు, వారి కుటుంబాలకు శాపంగా మారాయి. రెండో దశ ప్రతిపాదన, రూపకల్పనపైనే యాజమాన్యం దృష్టి సారించలేదంటే ఏమనుకోవాలి..? అని కార్మికులు వాపోతున్నారు. మెగా ఓసీకి సంబంధించి ప్రణాళిక, ప్రతిపాదనలు పంపి ఉంటే కనీసం నాలుగేళ్ల కాలం పట్టేది. పర్యావరణ, అటవీ, మైనింగ్, కేంద్ర బొగ్గు గనుల శాఖ ఇలా అన్ని అనుమతులు వచ్చే నాటికి సమయం పట్టేది. అయినా ఈ దిశగా చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ విస్తరణపై చొరవ తీసుకోని పర్యవసానమే ఈ దుస్థితికి కారణమని పలువురు కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. ప్రస్తుతం డోలాయమాన స్థితిలో కొట్టుమిట్టాడుతున్న పట్టణ వాసులు అటు సింగరేణి గనులు లేక ఇటు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేక రెంటికి చెడ్డ రేవడిలా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

పూర్వ వైభవం ఉత్తమాటే..!

ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు రెండో దశకు అతీగతీ లేకపోవడంతో రామకృష్ణాపూర్ భవిష్యత్‌పై పట్టణ ప్రజలు ఆశలు వదిలేసుకుంటున్నారు. కార్మికులు, కార్మికేతరులు క్రమేణా ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి. ఇతర ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఎవరి సొంత ఊళ్లకు వారు వెళ్లిపోయే పరిస్థితి మినహా మరో మార్గం లేదు. సుదీర్ఘ చరిత్ర కలిగి ఉన్న సంస్థలో తమ పట్టణానికి బొగ్గుపెళ్లతో పెనవేసుకుపోయిన బంధం ఇక తెంచుకుపోయినట్లేనని కార్మికులు కలత చెందుతున్నారు.

వంద రకాల పక్షులు గుర్తించాం

- డబ్ల్యూడబ్ల్యూఎఫ్ బృందం ప్రతినిధులు



పక్షులను కెమెరాలో బంధిస్తున్న ప్రతినిధులు

నెన్నెల: మండలంలోని జోగాపూర్ అటవీ, ప్రాజెక్టు ప్రాంతాల్లో వందకు పైగా పక్షి జాతులు, 20 రకాల సీతాకోక చిలుకలను గుర్తించామని వరల్డ్ వైడ్ ఫెడరేషన్(డబ్ల్యూడబ్ల్యూఎఫ్) బృందం ప్రతినిధులు హర్ష, రాజశేఖర్ తెలిపారు. బుధవారం మండలంలోని జోగాపూర్ అటవీ ప్రాంతంలో పర్యటించి వివిధ రకాల పక్షి జాతులను కెమెరాల్లో బంధించారు. పక్షుల ఆవాసాలు, వాటి జీవన విధానం, ఆహారం, నివసించే ప్రాంతాలు, అరుపులను క్షుణ్ణంగా పరిశీలించి అటవీ అధికారులకు వివరించారు. వివిధ జాతి పక్షుల మనుగడను ఎలా కాపాడుకోవాలో, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గ్రే హెడెడ్ ఫిష్ ఈగల్, ఎల్లో పోర్టెడ్ గ్రీన్ ఫిజియెన్, బ్లాక్ హుడెడ్, కామన్‌టైలర్, ప్రింటాకోల్, రోబిసెల్‌డక్, గ్రేహరాన్, స్పాట్‌బిల్డక్ వంటి అనేక రకాల పక్షులు ఇక్కడ ఉన్నట్లు గుర్తించారు. ఈ పక్షుల విశేషాలు, వాటిని గుర్తించడంపై ఇక్కడి అధికారులకు అవగాహన కల్పించారు. బెల్లంపల్లి, కుశ్నపల్లి ఎఫ్‌ఆర్‌ఓలు పూర్ణచందర్, దయాకర్, బెల్లంపల్లి డివిజన్ అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జాదవ్ అంబాజీ

లక్సెట్టిపేట: విద్యార్థులు వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలని గిరిజనాభివృద్ధి అధికారి జాదవ్ అంబాజీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను పరిశీలించి మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులు పది జీపీఏ సాధించా లని, ఉన్నత చదువులకు వార్షిక పరీక్షల ఫలి తాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం వంటగది పరిసరాలు, భోజనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, హెచ్‌డబ్ల్యూవో మల్లారెడ్డి, పీడీ జీవరత్నం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

నస్పూర్: ఈ నెల 30 నుంచి డిసెంబర్ 2 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. పట్టణ పరిధిలోని కేజీపీ డిఫెన్స్ అకాడమీ గ్రౌండ్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి పోటీలు బుధవారం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 30 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో నస్పూర్ క్రీడాకారులు బాలుర విభాగంలో ఫర్దిన్, కే.ఆనంద్‌శర్మ, కే.రాజేశ్, కే.వర్షిత్, సుహాన్, బి.హర్షవర్దన్, ఎస్‌కే.అబ్దుల్, అభిలాష్, రెహాన్, అజయ్‌కుమార్, బాలికల విభాగంలో ఎస్‌కే సుహానా, జి.హిమనిరెడ్డి, కే.శాన్విశ్రీ, ఎం.అనన్య, డి.అనూష, సాయివర్షిత, రుత్విక, శ్రీస్థిక, వర్దిని, ఆర్.యోగితాశ్రీ ఉన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ, పీడీలు కొట్టె దేవేందర్, వెంకటేశ్, ధరణ్, సురేష్, కోచ్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు

వేమనపల్లి: మండలంలోని బుయ్యారం గ్రామ సమీప అడవుల్లోని గుడుంబా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. 22 డ్రమ్ములలో నిల్వ ఉంచిన 4 వేల లీటర్ల బెల్లం పానకం, 5 లీటర్ల గుడుంబా, సామగ్రిని ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన పారపొక్కుల సత్యక్క, అడె లింగుబాయిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఫణిధర్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో ఈ నెల 25న కొమ్ములవార్ ప్రవీణ్ ఇంట్లో చోరీకి పాల్పడిన మలికర్ గజానంద్, సినోల్ల నారాయణను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఫణిధర్ తెలిపారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ ఈనెల 25న ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లగా గమనించిన దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న 42 తులాల వెండి, రెండు కిలోల రాగి బిందె ఎత్తుకెళ్లారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి వారివద్ద నుంచి సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చోరీకి గురైన బైక్ స్వాధీనం



బైక్, నిందితులతో సీఐ కరుణాకర్‌రావు

ఆదిలాబాద్‌టౌన్: మావల మండలంలోని బట్టిసావర్గాంకు చెందిన ఆర్మీ కానిస్టేబుల్ భగత్ దమ్మపాల్ ద్విచక్ర వాహనం ఈనెల 18న చోరీకి గురైనట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని బాలాజీ వైన్స్ పక్కన గల మెట్రో ఆటోమొబైల్స్‌లో బైక్ పార్కింగ్ చేసి ఉండగా దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు చేయగా బుధవారం టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ పంజాబ్ చౌక్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా అర్లి(టి) గ్రామానికి చెందిన చిట్యాల దశరథ్, సాత్‌పల్లి అనిల్ బైక్ విక్రయించేందుకు తీసుకెళ్తూ పట్టుబడ్డారు. వారిని విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు వివరించారు. బైక్ స్వాధీనం చేసుకున్న వారిలో కానిస్టేబుళ్లు నరేష్, నరేందర్, రమేశ్, సుధాకర్ రెడ్డి, ప్రవీణ్, సంజీవ్, గోపాల్, తదితరులు ఉన్నారు.

శిక్షణ అధికారుల క్షేత్ర పర్యటన

- జామ్ గ్రామాన్ని సందర్శించిన ట్రెయినీ ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లు
- వివిధ శాఖల పనితీరు వివరించిన జిల్లా అధికారులు



సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న ట్రెయినీ అధికారులు



మొక్క నాటుతున్న ట్రెయినీ అధికారులు



బతుకమ్మ ఆడుతున్న శిక్షణ అధికారులు

సారంగాపూర్(నిర్మల్): శిక్షణలో ఉన్న 29 మంది ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు బుధవారం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని జామ్ గ్రామంలో పర్యటించారు. శిక్షణలో భాగంగా ఆయా శాఖల పనితీరు, బాధ్యతలు, విధులు, అధికారాలు, తదితర అంశాలపై డీపీవో శ్రీనివాస్, డీఎల్‌పీవో రమేశ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, ఎంపీవో అజీజ్ ఖాన్ వారికి వివరించారు. ప్లాస్టిక్ నిషేధించడంలో భాగంగా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు శుభకార్యాలు, ఇతరత్రా కార్యక్రమాల్లో స్టీలు సామగ్రి వాడేలా గ్రామ పంచాయతీల్లో స్టీల్‌బ్యాంకు ఏర్పాటు చేసి సామగ్రి పంపిణీ చేసేందుకు నిర్ణయించామని వివరించారు. తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, తదితర అంశాలు, అందు కోసం ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు, వినియోగిస్తున్న తీరు వివరించారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ట్రెయినీ అధికారులు గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. సెగ్రిగేషన్ షెడ్డు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాల, కళాశాలలు సందర్శించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గోవింద్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంఆర్ఐ నర్సింహులు, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణమోహన్ గౌడ్, ఈజీఎస్ ఏపీఎం మాధురి, ఏపీవో లక్ష్మారెడ్డి, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

గాజులు కొని.. డబ్బులు చెల్లించి



గాజులు కొనుగోలు చేస్తున్న ఐఎఫ్ఎస్ పల్లవి

సారంగాపూర్: శిక్షణలో ఉన్న ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల పర్యటనలో భాగంగా ఐకేపీ ద్వారా రుణాలు పొందిన మహిళలు తాము స్వయంగా తయారు చేసి విక్రయిస్తున్న వివిధ వస్తువుల స్టాళ్లను ఏర్పాటు చేశారు. ట్రెయినీ అధికారులు వాటిని చూసి ఇవి మీరే తయారు చేశారా? అంటూ ఆశ్చర్యానికి గురయ్యారు. అగరత్తులు, విభూతి ఉండలు, వెదురు బుట్టలు చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. పల్లవి అనే మహిళా అధికారి మాత్రం చేతితో తయారు చేసిన ముత్యాల గాజులను చూసి ముచ్చటపడింది. వాటికి రూ.120 చెల్లించి కొనుగోలు చేసి చేతికి ధరించింది. డబ్బులు వద్దన్నా వినకుండా నేను కళను చూసి డబ్బులు ఇస్తున్నానని అనడం కొసమెరుపు.

తల్లిదండ్రుల కల నెరవేర్చా



చిన్ననాటి నుంచి మాఅమ్మా, నాన్నలు కష్టపడి చదవడం అలవాటు చేశారు. నాకు కూడా చదువుపై ఆకాంక్ష ఎక్కువగా ఉండేది. మాది ఉద్యోగుల కుటుంబం కావడంతో అమ్మానాన్న కోరుకున్నట్లుగానే కష్టపడి చదివి యూపీఎస్సీలో 153వ ర్యాంకు సాధించి తల్లిదండ్రుల కల నెరవేర్చా. నాకు చాలా సంతోషంగా ఉంది.

– శుభం అగర్వాల్, ఐపీఎస్, ఉత్తరప్రదేశ్

కుటుంబసభ్యుల ప్రోత్సాహం..



నేను ఏదైనా అనుకుంటే తప్పకుండా సాధిస్తాననేది మా కుటుంబ సభ్యుల నమ్మకం. వారు నమ్మినట్లుగానే చాలాసార్లు సక్సెస్ అయ్యా. యూపీఎస్సీలోనూ ర్యాంకు సాధిస్తావని నన్ను ప్రోత్సహించారు. మా గురువులు సైతం నామీద నమ్మకం ఉంచారు. వారి నమ్మకం వమ్ము చేయకుండా యూపీఎస్సీలో 144వ ర్యాంకు సాధించా.

– ప్రశాంత్‌కిరణ్, ఐపీఎస్, రాజస్థాన్

నమ్మకంతో చదివా..



ఎంతోమంది తమలో ఉన్న ప్రతిభను తామే గుర్తించలేక అధైర్యపడి చదువును కొనసాగించడంలేదు. వామ్మో సివిల్సా. యూపీఎస్సీనా...నేను అందుకు సరిపోతానా సెలెక్ట్ అవుతానా అన్న భయంతోనే సగం నిశ్చేష్టులవుతున్నారు. కష్టపడి చదివితే సాధించలేనిది ఏదీ లేదని నమ్మకంతో చదివా. అందుకే ఐఎఫ్ఎస్‌లో 650వ ర్యాంకు సాధించా.

– పల్లవి, ఐఎఫ్అండ్‌టీపిఎఫ్ఎస్, మహారాష్ట్ర

బాసరలో మాజీ ఈవో పూజలు



ప్రసాదం అందజేస్తున్న ప్రధాన అర్చకులు

బాసర(ముధోల్): బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని బుధవారం ఆలయ మాజీ ఈవో, నల్గొండ జిల్లా రిటైర్డ్ జాయింట్ కలెక్టర్.ఎం.వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ,స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి తీర్థప్రసాదాలు అందించారు. కొండూరి ప్రత్రాప్రావు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

రైలు ఎక్కుతుండగా జారిపడి ఒకరికి గాయాలు

బాసర(ముధోల్): రైలు ఎక్కుతుండగా జారిపడి ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన బాసర రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహమూద్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి విశాఖపట్నం బయలుదేరిన విశాఖ ఎక్స్‌ప్రెస్ బాసర రైల్వేస్టేషన్‌లో ఆగింది. మహారాష్ట్రకు చెందిన అజయ్ అనే ప్రయాణికుడు రైల్లోంచి కిందకు దిగాడు. ట్రెయిన్ కదులుతున్న సమయంలో మళ్లీ ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

చెరువులోదూకి ఒకరు ఆత్మహత్య

భైంసారూరల్(ముధోల్): చెరువులో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ నైలు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన బెంద్రి విఠల్ (60) కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతోపాటు ఆర్థిక సమస్యలు పెరిగిపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందాడు. బుధవారం గ్రామ సమీపంలోని పోచమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఒకరు..

ఆసిఫాబాద్‌అర్బన్: మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వలేదని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సందీప్‌నగర్‌కు చెందిన మడావి విజయ్‌కుమార్ (38) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి మద్యానికి డబ్బులివ్వాలని తన అక్క, బావలను అడగగా అందుకు వారు నిరాకరించారు. దీంతో ఇంట్లోకి వెళ్లి దూలానికి ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



విజయ్‌కుమార్ (ఫైల్)

మొర్రిగూడలో బిహార్‌వాసి..

జన్నారం(ఖానాపూర్): ఉరేసుకుని బిహార్‌వాసి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌కు చెందిన సింటు కుమార్ (22) కొంతకాలంగా జన్నారం మండలం మొర్రి గూడ సమీపంలోని రాఘవేంద్ర రైస్‌మిల్లులో కూలీగా పనిచేస్తున్నాడు. వారం రోజులుగా మద్యానికి బానిసై పనికి సరిగా వెళ్లడం లేదు. మంగళవారం రాత్రి బిహార్‌లో ఉన్న సోదరుడు కమల్ పాస్వన్‌కు ఫోన్‌చేసి తనకు ఇక్కడ పనిచేయడం ఇష్టంలేదని, ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. రైస్‌మిల్లు పక్కనే ఉన్న పాడుబడిన గెస్ట్‌హౌజ్ గేటుకు టవల్‌తో ఉరేసుకున్నాడు. కమల్ పాస్వన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజవర్ధన్

ఉరేసుకుని యువకుడు..

తాంసి: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కలీం తెలిపిన వివరాల మేరకు భీంపూర్ మండలం నిపాని గ్రామానికి చెందిన అరిగెల మణికంఠ (25) కూలీ పనితో పాటు బైక్ మెకానిక్ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసై కొంతకాలంగా పనులకు వెళ్లడం మానేశాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి ఆశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



మణికంఠ (ఫైల్)

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం



వృద్ధురాలిని కుమార్తెకు అప్పగిస్తున్న పోలీసులు

ధర్మపురి: కుటుంబ కలహాలతో గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ వృద్ధురాలిని పోలీసులు కాపాడిన సంఘటన మండలంలోని రాయపట్నం వద్ద చోటు చేసుకుంది. ఎస్సై ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం ద్వారకకు చెందిన సాయిని మల్లేశ్వరి బుధవారం ఇంట్లో గొడవపడి ఆత్మహత్య చేసుకునేందుకు రాయపట్నం గోదావరి వద్దకు చేరుకుంది. వంతెనపై నుంచి దూకేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడే ఉన్న పోలీసులు కాపాడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. వృద్ధురాలి కూతురు లలితకు ఫోన్ చేసి రప్పించి ఆమెకు అప్పగించారు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: హత్యాయత్నం కేసులో ఒకరికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ అసిస్టెంటు సెషన్స్ జడ్జి శ్రీనివాస్ బుధవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి డల్లుసింగ్ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని రాంరావ్ బాగ్‌లో నివాసం ఉంటున్న లక్ష్మణ్ తరచూ మద్యం సేవించేవాడు. ఈక్రమంలో 2023, ఫిబ్రవరి 10న ఇంటిపక్కనే నివాసం ఉంటున్న చంద్రబాగాను తన భార్య పిలుస్తుందని చెప్పి తీసుకెళ్లాడు. ఆమె ఒంటిపై ఉన్న బంగారం కాజేయాలన్న ఉద్దేశంతో చున్నీతో ఉరి బిగించాడు. గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. బాధిత మహిళ నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై యాసీర్ అరాఫత్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారావు 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చాడు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన కేసులో ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల ఎస్‌బీఐ సమీపంలోని ఏటీఎంలో చోరీకి యత్నించిన వ్యక్తికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ మంచిర్యాల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కే.నిరోష బుధవారం తీర్పు నిచ్చినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2021 జనవరి 27న సదరు ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తి పగులగొట్టి చోరీకి యత్నించాడు. బ్యాంకు మేనేజర్ రవితేజ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై డీ.కిరణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో సీసీ ఫుటేజీ ఆధారంగా చోరీకి యత్నించిన వ్యక్తి మందమర్రి చెందిన ఇప్పనపల్లి శ్రీకాంత్‌గా గుర్తించి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.రవీందర్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి నిందితుడికి శిక్ష ఖరారు చేస్తూ పైవిధంగా తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

బెజ్జూర్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన జర్పట శ్రీకాంత్ (22) బుధవారం ద్విచక్ర వాహనంపై పోతేపల్లికి వెళ్తుండగా అదుపుతప్పి టాటామ్యాజిక్‌ను ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ధాన్యం కుప్పను ఢీకొని ఒకరు ..



ఆనంద్‌రావుపటేల్ మృతదేహం

లోకేశ్వరం: మండలంలోని గొడిసెరా గ్రామానికి చెందిన ఆనంద్‌రావు పటేల్ (45)కొంతకాలంగా నిజామాబాద్ పట్టణంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం హోటల్ పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా పంచగుడి గ్రామ సమీపంలో రోడ్డుపై పోసిన వరి ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై అశోక్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య చంద్రకళ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై కుటుంబ సభ్యుల నుంచి ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ..



తుంరం బొజ్జు (ఫైల్)

వాంకిడి: మద్యానికి బానిసై పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మండలంలోని సోనాపూర్‌కు చెందిన తుంరం బొజ్జు (32), రేణుకకు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ముగ్గురు సంతానం. కొంతకాలంగా మద్యానికి బానిసై ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఈనెల 25న మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మరడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం మృతుని భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

భర్తను చంపిన భార్య అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.2 గ్రామానికి చెందిన దులాల్ సర్కార్‌ను హతమార్చిన కేసులో అతని భార్య సరస్వతీ సర్కార్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు కాగజ్‌నగర్‌రూరల్ సీఐ శ్రీనివాస్, ఈజ్‌గాం ఎస్సై మహేందర్ తెలిపారు. దులాల్ సర్కార్ నిత్యం మద్యం సేవిస్తుండడంతో ఇరువురి మధ్య గొడవ జరిగిందని, కోపోద్రిక్తురాలైన సరస్వతీ క్రికెట్ బ్యాట్‌తో తలపై కొట్టడంతో మృతి చెందాడని పేర్కొన్నారు. క్రికెట్ బ్యాట్‌ను స్వాధీన పర్చుకుని మహిళను అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సిలిండర్ లీకై దుకాణం దగ్ధం

రెబ్బెన(ఆసిఫాబాద్): సిలిండర్ లీకై తినుబండారాల దుకాణం దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దుకాణం యజమాని సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం తినుబండారాలు తయారు చేస్తుండగా సిలిండర్ లోంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలో మంటలు ఎగిసిపడడంతో గమనించిన స్థానికులు సీఐ బుద్దెస్వామి, ఎస్సై చంద్రశేఖర్‌కు సమాచారం అందించారు. వారు వెంటనే జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టిన డీబీఎల్ కంపెనీ ప్రతినిధులను పురమాయించడంతో హుటాహుటిన వాటర్‌ట్యాంకర్‌తో వచ్చి మంటలు అదుపుచేశారు. ఘటనలో సుమారు రూ.10వేల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.



షాపులో ఎగిసి పడుతున్న మంటలు

పత్తి వాహనం దగ్ధం

కౌటాల: కౌటాల–కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై మినీ స్టేడియం సమీపంలో ప్రమాదవశాత్తు పత్తి తరలిస్తున్న మినీ వ్యాన్ దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం బెజ్జూర్‌లోని సేరెళ్ల సంతోష్‌కు చెందిన మినీ వ్యాన్‌లో బుధవారం 35 క్వింటాళ్ల పత్తిలోడుతో సిర్పూర్(టి)లోని సీసీఐ కేంద్రానికి వెళ్తుండగా ఒక్కసారిగా వ్యాన్ క్యాబిన్‌లోంచి మంటలు చెలరేగాయి. డ్రైవర్ సుధాకర్ వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కకు ఆపి కిందకు దూకాడు. గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.4 లక్షల నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



మంటల్లో కాలుతున్న మినీ వ్యాన్

గంజాయి మత్తులో యువకుడి వీరంగం!

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపం వద్ద బుధవారం గంజాయి మత్తులో ఓ యువకుడు వీరంగం సృష్టించిన ఘటన సంచలనం సృష్టించింది. మత్తులో ఉన్న యువకుడు రహదారిపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్న మరో యువకునిపై దాడి చేశాడు. గమనించిన స్థానికులు అడ్డుకుని విడిపించడంతో సదరు యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో గట్టిగా అరుస్తూ ఇప్పుడెవర్ని చంపాలి.. అంటూ సమీపంలో ఉన్న ఓ స్కూటర్‌ను పైకి లేపి కింద పడేయడంతో అందరూ భయభ్రాంతులకు గురై అక్కడి నుంచి పారిపోయారు. గోడలను గుద్దడం, పిచ్చిగా అరవడంతో స్థానికులు 100కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న బ్లూ కోర్ట్ పోలీసులు ఎంత చెప్పినా వినక పోవడం గమనార్హం. ఎట్టకేలకూ అతని స్నేహితులు వచ్చి తీసుకెళ్లడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై స్థానిక సీఐని వివరణ కోరగా మా దృష్టికి వచ్చింది. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామన్నారు.

పట్టుకున్నారు.. వదిలేశారు

ఖానాపూర్: అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. వాహనాలను తహసీల్దార్ కార్యాలయానికి తరలించాలని ఆదేశించినప్పటికీ ట్రాక్టర్ల నిర్వాహకులు ససేమిరా అంటూ రోడ్డుపైనే నిలిపివేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ట్రాక్టర్ టైర్లలో గాలి తీసినట్లు సమాచారం. ఈ విషయమై తహసీల్దార్ శివరాజ్‌ను వివరణ కోరగా మొరం అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందడంతో సిబ్బంది వాటిని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించాలని ఆదేశించారన్నారు. పలువురు నాయకులు తనకు ఫోన్ చేసి మరోసారి అనుమతి లేకుండా మొరం తరలించబోమని చెప్పడంతో ట్రాక్టర్లను వదిలిపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కానీ వాహనాల టైర్లలోంచి గాలిమాత్రం తాము తీయలేదన్నారు.



రోడ్డుపై నిలిపి ఉంచిన మొరం ట్రాక్టర్లు

బాల్యవివాహాల నిర్మూలనకు కృషిచేయాలి

మంచిర్యాలక్రైం: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారం రెడ్డి అన్నారు. 'బాల్‌వి వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని సాయికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాల నిరోధక చట్టం, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎక్కడైన బాల్య వివాహాలు జరిగితే చైల్డ్ ప్రొటెక్షన్ అధికారికి సమాచారం అందించాలన్నారు. ఉచిత న్యాయసహాయం కోసం 15100కు ఫోన్ చేయాలన్నారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిలర్ శ్రీనివాస్, సీడబ్ల్యూసీ సభ్యురాలు సౌజన్య, హెచ్ఎం నసిమా ఫాతిమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్పిత మారం రెడ్డి